
ప్రజాశక్తి
శుక్రవారం 25 నవంబర్ 2022
5
పార్వతీపురం మన్యం



26న జగనన్న క్రీడా సంబరాలు

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 26న జగనన్న క్రీడా సంబరాలు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు చెప్పారు. నియోజకవర్గ, జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. కబడీ, వాలీబాల్ పోటీలు స్త్రీ పురుషులకు, క్రికెట్ పురుషులకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 17ఏళ్ల నిండిన యువతీ యువకులు ఆధార్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో క్రీడా నిర్వాహకులను ఈనెల 26న ఉదయం 8గంటలకు సంప్రదించాలని కోరారు. రూ.50లక్షల ప్రైజ్ మనీ తో క్రీడా పోటీల నిర్వహణ జరుగుతుందని చెప్పారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర ఈ పోటీలను ప్రారంభిస్తారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.



ప్రజారోగ్యంతో చెలగాటం..

వైద్య కళాశాల ప్రిన్సిపల్ నిర్వాకం

కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్టుగా ఉంది మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ పనితీరు. ప్రిన్సిపల్ వైఖరి ప్రజారోగ్యంతో చెలగాటంగా మారుతోంది. ఇటు రోగులు, అటు వైద్యులు కూడా అవస్థలు పడుతున్నారు. చివరికి ఏరియా ఆస్పత్రులు, సిహెచ్‌సిల్లో కేంద్రప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశపెట్టనున్న డిఎన్‌బి కోర్సుల అర్హతను కూడా కోల్పోయే ప్రమాదం కనిపిస్తోంది.

- వైద్యులను రిలీవ్ చేయకపోవడంతో ఆస్పత్రుల్లో అందని వైద్యసేవలు
- వైద్యులపైనా పనిభారం
- డిఎన్‌బి ప్రవేశాల అర్హత కోల్పోనున్న ఆస్పత్రులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరైన విషయం విదితమే. మెడికల్ కళాశాల కోసం జిల్లా కేంద్రాస్పత్రిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇక్కడ పనిచేయడానికి తగినంత మంది వైద్యులు, 706 మంది సిబ్బందిని కూడా నియమిస్తోంది. దీంతో ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న వైద్యనిపుణులందరినీ ఎపి వైద్యవిధాన పరిషత్తు పరిధిలోని శృంగవరపుకోట, గజపతినగరం, రాజాం ఏరియా ఆస్పత్రులు, చీపురుపల్లి, భోగాపురం, నెల్లిమర్ల, బాడంగి, బొబ్బిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు సంబంధిత విభాగం బదిలీ చేసింది. మెడికల్ కాలేజీ తరపున నియమించిన సుమారు 20 మంది వైద్యులు చేరినా ఇక్కడి నుంచి బదిలీ అయిన 22 మందిని రిలీవ్ చేయడం లేదు. దీంతో, ఏరియా, కమ్యూనిటీ ఆస్పత్రుల్లో వైద్యసేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ఇటీవలే పైన పేర్కొన్న ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసి, పడకల సంఖ్య, పోస్టుల సంఖ్య పెంచినట్టు స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు ప్రభుత్వం చెప్తూ వచ్చింది. దీనిపై తెగేసి ప్రచారం చేయడంతో ఎక్కువ మంది రోగులు ఆయా ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఈనేపథ్యంలో ఒపి సంఖ్య కూడా రెట్టింపైంది. ఏరియా ఆస్పత్రులకు గతంలో నెలకు 10 వేల ఒపి రాగా, ప్రస్తుతం 18 వేల వరకు ఉంటోంది. ఇన్‌పేషెంట్ల సంఖ్య కూడా అందుకు తగ్గట్టే పెరిగింది. సిహెచ్‌సిల్లోనూ ఒపి, ఐపి పెరిగిందని స్థానిక వైద్యాధికారులు చెబుతున్నారు. కానీ, ఈ ఆస్పత్రుల్లో చేరాల్సిన వైద్యులను మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మలీల విడుదల చేయడం లేదు. ఇప్పుడిప్పుడే నియామకాలు జరుగుతున్నాయని, అంతా కొలిక్కివచ్చాక ఆలోచిస్తానని అంటున్నట్టు సమాచారం. దీనివల్ల ఆయా ఆస్పత్రుల స్థాయికి తగట్టు వైద్యులు లేరు. ముఖ్యంగా బొబ్బిలి, బాడంగిలో గైనకాలజిస్టులు లేరు. చీపురుపల్లి, భోగాపురం, బొబ్బిలిలో చిన్నపిల్లల వైద్యులు, ఎస్.కోటలో ఎముకల వైద్యులు, నెల్లిమర్లలో జనరల్ ఫిజీషియన్ లేరు. భోగాపురంలో సర్జన్, గజపతినగరంలో ఇఎన్‌టి లేనట్టు సమాచారం. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పెరిగిన ఒపి, ఐపిల వల్ల తమపై పనిభారం పెరుగుతోందని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటు జిల్లా కేంద్రం (మెడికల్ కాలేజీ)లో ఆస్పత్రికి కొత్తగా వచ్చినవారు, ఇక్కడి నుంచి వెళ్లాల్సిన వారు గతం కంటే రెట్టింపు అంటే సుమారు 42మంది వైద్యులు ఉన్నారు. వీరిలో బదిలీపై వెళ్లాల్సిన 22 మంది మాత్రమే ఒపి నిర్వహిస్తుండడం, కొత్తగా వచ్చిన వారికి పనిలేకుండా పోవడం గమనార్హం.

మరోవైపు ఈ ఏడాది నుంచి డిఎన్‌బి (డిప్లమా నేషనల్ బోర్డు) కోర్సుల అర్హత కల్పించేందుకు కేంద్ర ఆరోగ్య శాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని ఏరియా ఆస్పత్రులు, సిహెచ్‌సిల్లో ఫ్యామిలీ మెడిసిన్, గైనిక్, పీడియాట్రిక్స్, ఎనస్తీషియా, ఆర్థో, ఇఎన్‌టి తదితర విభాగాల్లో పనిచేస్తున్న వైద్యులు, వారి హోదాలను సంబంధిత ఆస్పత్రి అధికారుల నుంచి వైద్యవిధాన పరిషత్తు విభాగం సమాచారం సేకరిస్తోంది. దీని ఆధారంగా వైద్యుల సంఖ్య, సీనియారిటీ ఆధారంగానే ఆయా ఆస్పత్రుల్లో డిఎన్‌బి కోర్సుల ప్రవేశానికి అర్హత ఉంటుంది. కానీ ఆయా ఆస్పత్రులకు వెళ్లాల్సిన సీనియర్ వైద్యులంతా మెడికల్ కాలేజీలోనే ఉండిపోవడంతో ఆ అర్హతను కోల్పోయే ప్రమాదం ఉంటుందని పలువురు వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ పద్మలీలను వివరణ కోరేందుకు 'ప్రజాశక్తి' ప్రయత్నించగా దాటవేత ధోరణి అవలంబించారు.

చిరుజల్లులతో గుబులు

- వర్షానికి తడిసిన వరి పనలు
- అన్నదాత ఆందోళన

ఉమ్మడి జిల్లాలో గురువారం పలుచోట్ల కురిసిన చిరుజల్లులు రైతులను హడలెత్తించాయి. కోసిన వరిచేను పొలాల్లో ఉండటంతో తీవ్ర ఆందోళన కలిగించాయి. పంటను కాపాడుకునేందుకు రైతులను పొలాల వైపు పరుగులు పెట్టించాయి. పంట చేతికొచ్చే సమయంలో అల్పపీడన ప్రభావంతో మేఘాలు మబ్బులుగా ఉండడంతో అన్నదాతలను ఆందోళన వెంటాడుతూనే ఉంది.



వంగరలో వరిచేను కుప్పలు పెడుతున్న రైతులు

ప్రజాశక్తి-బొబ్బిలి

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో గురువారం ఉదయం పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. వీరఘట్టం, పాలకొండ, బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, నెల్లిమర్ల, గుర్ల, మెరకముడిదాం, వేపాడ, తదితర మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. దీంతో పొలాల్లో కోసేసిన వరిపనలు తడిసిపోయాయి. వాతావరణం ఒక్కసారిగా మారడంతో రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో 95 శాతం వరికోత దశకు వచ్చింది. 70 శాతానికి పైగా వరి కోతలు పూర్తయ్యాయి. నాలుగు రోజుల క్రితం వాతావరణశాఖ హెచ్చరికలు రావడంతో వరి కోతలను రైతులు వాయిదా వేసుకున్నారు. కానీ వర్షం కురవకపోవడంతోపాటు ఎండలు కాయడంతో రైతులు వర్షాలు రావనే నమ్మకంతో బుధవారం వరికోతలు ప్రారంభించారు. తుపాను హెచ్చరికలకు ముందు కోసేసిన వరిచేను రైతులు కుప్పలు వేయగా, బుధవారం కోసిన వరిపంటను కుప్పలు వేయకపోవడంతో గురువారం కురిసిన చిరుజల్లులకు తడిసిపోయింది. చేతికి వచ్చిన పంట తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కష్టపడి, అప్పులు చేసి సాగు చేస్తున్న పంట తడిసిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు పంటను పొలాల్లోనే కుప్పలు వేశారు. ఎక్కడ చూసినా పొలాల్లో కుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

వీరఘట్టం : మండలంలో గురువారం రాత్రి వర్షం ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ఉన్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసినప్పటికీ అకాల వర్షం కారణంగా అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రాక

ప్రజాశక్తి- కలెక్టరేట్

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లాలో శుక్రవారం పర్యటిస్తారని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.50 గంటలకు పార్వతీపురం చేరుకుంటారని 11 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగే సమీక్షా సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం12 గంటలకు పట్టణ పోలింగ్ స్టేషన్లు పరిశీలించి, బూత్ స్థాయి అధికారులు, ప్రజలతో సమస్యలపై చర్చిస్తారని వివరించారు. మధ్యాహ్నం 12.15 గంటలకు గ్రామీణ ఎన్నికల కేంద్రాలను పరిశీలించి బూత్ లెవెల్ అధికారులకు తగు సూచనలు చేస్తారన్నారు. 2 గంటలకు బయలుదేరి విజయనగరం వెళ్తారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పంటలను పరిశీలించిన కెవికె శాస్త్రవేత్తలు

కురుపాం : రస్తాకుంట బాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బియ్యాలవలస సచివాలయ పరిధిలో గల సూర్యనగరంలోని మామిడి, కొబ్బరి తోటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా తోటల్లో తెగుళ్లు వస్తే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, నివారణా చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు అమృతవీణ, ఎం. శ్రీనివాసరాజ్, ఎం.అనంత విహారి, అను, పి.ఉమా జ్యోతి, రైతులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఐద్వా నాయకులు

నేటి నుంచి మహిళా వజ్రోత్సవ సభలు : ఐద్వా

కలెక్టరేట్ : మహిళలపై జరిగే హింసావ్యతిరేక దినోత్సవం ఈనెల 25 నుంచి డిసెంబర్ 10వరకు (మానవహక్కుల దినోత్సవం) 16 రోజులు పాటు ప్రపంచవ్యాప్తంగా జరిగే మహిళా వజ్రోత్సవ సభలను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, శ్రామిక మహిళా సంఘం నాయకులు వి. ఇందిర కోరారు. ఈ సభలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆయా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రతి ఏటా మహిళా చైతన్య సభలు అనేక రుపాల్లో వివిధ కార్యక్రమాలు జరుగుతున్నాయని,మన రాష్ట్రంలో ఐద్వా 16 రోజులు వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు, పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. 2000 నుంచి ఐక్యరాజ్యసమితి ప్రచార కార్యక్రమాన్ని అధికారికంగా అన్ని దేశాలకు పిలుపు నిచ్చిందని అన్నారు. హక్కులు అమలు కావాలంటే నిరంకుశ మనువాద వదిలించుకోవాలని, శాస్త్రీయ ఆలోచనలు పెరగాలని, దుస్సాంప్రదాయాల నుంచి రక్షణ కావాలని, ఆత్మ గౌరవంగా బతికే హక్కులను కల్పించిన మన రాజ్యాంగాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్నెట్లో ప్రసార మాధ్యమాల్లో వస్తున్న అశ్లీల చిత్రాలను నిషేధించాలని, పోర్న్ నిషేధించాలని, మద్యాన్ని నియంత్రించాలని, గంజాయి మాదక ద్రవ్యాల అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లకై రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 25 నుంచి డిసెంబర్ 10 వరకు జరుగు హింస వ్యతిరేక మానవ హక్కుల పరిరక్షణ వజ్రోత్సవ కార్యక్రమాలను జయప్రదం చేయాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు. మహిళా సంఘం ఏర్పడి 75 ఏళ్లపూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 9,10 తేదీల్లో విజయవాడలో జరుగు వజ్రోత్సవ సభలో మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో సింహాచలమ్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే పరిశోధనల వైపు మొగ్గుచూపాలి

ప్రజాశక్తి - సీతానగరం

విద్యార్థులు బాల్యం నుంచే పరిశోధనల వైపు మొగ్గు చూపాలని, అందుకు ఇటువంటి సైన్స్ కార్యక్రమాలు దోహదపడతాయని డిఇఒ ఎస్‌డివి రమణ అన్నారు. మండలంలోని షిర్డీసాయి పాలిటెక్నిక్ కాలేజీలో 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాలకొండ ఒపీనియన్ శాఖ అధికారి ఆర్.విజయమారి మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యం, సృజనాత్మకత వెలికి తీయడానికి సైన్స్ కాంగ్రెస్ చక్కని తోడ్పాటును ఇస్తాయని తెలిపారు. కావున విద్యార్థులు వీటినివినియోగించి అత్యుత్త ప్రదర్శన చేయాలని ఆకాంక్షించారు. సమగ్ర శిక్ష సిఎంఒ చక్ర శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో తోలి సైన్సు కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఆప్ కాస్ట్ జిల్లా కోఆర్డినేటర్ ఇ.రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో 115 పాఠశాలలు ప్రాజెక్టు ఈ పోటీల్లో పాల్గొన్నాయన్నారు. ఇందులో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ఏడు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపిక అవుతాయన్నారు. ఈ ఏడు ప్రాజెక్టులు వచ్చేనెల నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు పాల్గొనాలని తెలిపారు. ఆప్ కాస్ట్ జిల్లా కోఆర్డినేటర్ కోట అయ్యప్ప మాట్లాడుతూ ప్రదర్శన రాష్ట్రస్థాయిలో ఎలా ఉండాలో వివరించారు. కార్యక్రమం ముగింపు సమావేశానికి పాలకొండ, డిప్యూటీ డిఇఒలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఏడు ప్రాజెక్టుల విద్యార్థులను, ట్రైనీ టీచర్లను అభినందిస్తూ మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో సీతానగరం ఎంఇఒ, జిల్లా జిల్లా సైన్సు అధికారి జి.సూరిదేముడు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాచిపెంట మండలం పాంచాలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై వేసిన నాటిక పలువుర్ని ఆకట్టుకుంది

భామిని : జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో స్థానిక కెజిబివిలో 9వ తరగతి విద్యార్థిని కె.స్వాతి ప్లాస్టిక్ వ్యర్థాలు నుంచి ఇటుకుల తయారీ అన్న అంశం ఇచ్చిన ప్రదర్శనకు జిల్లా స్థాయిలో రెండో స్థానం కైవసం చేసుకుంది. ఈమెకు డిప్యూటీ డిఇఒలు బ్రాహ్మాజీ, విజయలక్ష్మి బహుమతి ప్రదానం చేశారని కెజిబివి ఎస్ఒ బి.శారద తెలిపారు. స్వాతిని, సైన్స్ ఉపాధ్యాయులు సిహెచ్ రమణమ్మను ఎస్ఒ, పాఠశాల సిబ్బంది అభినందించారు.

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీల ప్రారంభ సభలో డిఇఒ



సైన్స్‌కాంగ్రెస్‌లో మాట్లాడుతున్న డిఇఒ రమణ

రాష్ట్రస్థాయికి తలవరం పాఠశాల ఎంపిక

వీరఘట్టం : జాతీయ చిల్డ్రన్స్ కాంగ్రెస్ సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనలో మండలంలోని తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వావిలపల్లి గీతాంజలి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయులు ఉప్పాడ అప్పారావు తెలిపారు. బ్యాంబు గ్రీన్ కనెక్షన్ మెటీరియల్ ప్రాజెక్టు ప్రదర్శించారు. కాంక్రీట్ రీ ఇంపోర్ట్ మెంట్ ఐరన్ కు బదులు వెదురు కర్ర వాడవచ్చునని ప్రదర్శించడంతో రాష్ట్ర స్థాయికి గీతాంజలి ఎంపికైనట్లు తెలిపారు . విద్యార్థి ఎంపిక పట్ల గైడ్స్ ఉపాధ్యాయులు జి.రామారావు, కె.నానిబాబు, ఎస్.మహేశ్వరరావు, వి.విజయ కుమారిని ప్రధానోపాధ్యాయులు అప్పారావు అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - కలెక్టరేట్

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు, జగనన్న భూ హక్కు సర్వే నిర్వహణ, ఉపాధి హామీ పనులు, జగనన్న స్వచ్ఛ సంకల్పం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు ప్లాస్టిక్ నిషేధం పగడ్బందీగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి ప్లాస్టిక్ సంచుల వాడకం నిర్మూలించడంతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. దీనిపై గ్రామీణ ప్రాంతంలో పూర్తి అవగాహన కల్పించాలన్నారు. మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి చెంది సుస్థిరమైన ఆదాయం సాధించేలా తోడ్పాటును అందించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో లభించే అటవీ ఉత్పత్తులు మహిళా సంఘాలు ద్వారా విక్రయించి ఆదాయ వనరులను పెంపొందించాలని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు శత శాతం పనులు గ్రౌండింగ్ జరగాలన్నారు. జలజీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిశాంత్ కుమార్, జెసి ఒ.ఆనంద్, డిఆర్ఒ జె.వెంకటరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎంవిఆర్ కృష్ణాజీ, ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజనీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, జిల్లా సర్వే, భూ రికార్డుల శాఖ అధికారి కె. రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎపిఎస్‌ఎఫ్‌సి జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి

సదస్సులో ఎపిఎస్‌ఎఫ్‌సి జిల్లా మేనేజర్

ప్రజాశక్తి - సాలూరు

ఏజెన్సీ ప్రాంతాల్లో చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని ఎపి స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. గురువారం పట్టణంలోని శివాలయం వీధిలో గల సీతారామ ధర్మశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యాపార అభిరుచికి అనుగుణంగా ఏఏ రంగాల్లో వ్యాపారం చేయాలో నిర్ణయించుకుని తమను సంప్రదించాలని కోరారు. దీనికి సంబంధించిన ప్రాజెక్టు రిపోర్టు తామే అందజేస్తామని చెప్పారు. ప్రాజెక్టు విలువను బట్టి సబ్సిడీ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో పండుతున్న పంటలకు అనుగుణంగా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చునని చెప్పారు. మొక్కజొన్న ఎక్కువగా సాగవుతున్నందున పశువుల దాణా తయారీ పరిశ్రమ నెలకొల్పవచ్చునని చెప్పారు. పేపరు ప్లేట్లు, గ్లాసుల తయారీ యూనిట్లు ఏర్పాటు చేయవచ్చు నని చెప్పారు. పరిశ్రమల స్థాపనకు 75శాతం వరకు రుణంగా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మిగిలిన 25శాతం వ్యాపారులు పెట్టుబడిగా పెట్టాలన్నారు. బిసిలకు 25నుంచి 35శాతం, ఎస్సీ, ఎస్టీలకు 40నుంచి 45శాతం సబ్సిడీ మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని మేనేజర్ శ్రీనివాసరావు కోరారు. ఈకార్యక్రమంలో బ్రాంచి అసిస్టెంట్ మేనేజర్ ఆర్.సత్యనారాయణ,ఎవి కిశోర్, డిప్యూటీ మేనేజర్ ఎస్.విజయ్, స్థానిక పారిశ్రామిక వేత్త జి.సంజీవరావు పాల్గొన్నారు.

ఉపాధి లేక వలస బాట

వీరఘట్టం : మండలంలో వ్యవసాయ కార్మికులకు ఉపాధి లేకపోవడంతో వలసబాట పడుతున్నారు. మండలంలోని గడగమ్మ గ్రామానికి చెందిన సుమారు 35 కుటుంబాలు గుడివాడలో ఉపాధి పనులు వలసబాట పట్టారు. గ్రామం నుంచి ఆటోలతో పార్వతీపురం చేరుకుని అక్కడి నుంచి రైల్లో గుడివాడ వెళ్తున్నారు. తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ పరిధిలోనే మొదటి కాలువ నుంచి తమ గ్రామానికి సాగునీరందకపోవడంతో రైతులు కూడా గత కొన్నేళ్లుగా కూలీలుగా మారారు. సుమారు 200 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నప్పటికీ పాలకుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రతి ఏటా వర్షంపై ఆధారపడి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పులి ప్రభావిత గ్రామాలను సందర్శించిన ఒడిశా అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని డోకిశిల పంచాయతీలోని బుచ్చింపేట, కొయ్యమెట్టవలస గ్రామాల్లో వరుసగా రెండు రోజులు పులి దాడి చేసి మేకలను, ఆవులను చెప్పివేయడంతో సదరు గ్రామాలకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒడిశాకు బందుగాం, నారాయణ పట్నం బ్లాకులకు చెందిన గ్రామస్తులు అక్కడి అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కొరాపుట్ జిల్లా అటవీ శాఖ అధికారి అనితరాయ్ గురువారం తన సిబ్బందితో కలిసి ఎపికి చెందిన అటవీ శాఖ సాలూరు రేంజి అధికారులతో కలసి సంయుక్త సర్వే నిర్వహించారు. ఇరువురు అధికారులు కలిసి పులిని నియంత్రించడానికి ముందు ముందు సమావేశాలు ఏర్పాటు చేసుకొని సంయుక్త కార్యాచరణ చేపట్టడానికి నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో రేంజర్ త్రినాథ, మక్కువ ఫారెస్టర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



సాలూరు రేంజ్ అధికారులతో మాట్లాడుతున్న కొరాపుట్ అటవీశాఖ అధికారి అనితరాయ్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆనంద్

నేటి నుంచి లింగ వివక్ష వ్యతిరేక మాసోత్సవం

ప్రజాశక్తి కలెక్టరేట్

లింగ వివక్ష వ్యతిరేక మాసోత్సవాలను శుక్ర వారం నుంచి ప్రారంభిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. లింగ వివక్ష వ్యతిరేక మాసోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన గురు వారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ "భయం, వివక్ష మరియు హింస లేకుండా గౌరవప్రదమైన జీవితానికి నిర్మాణాత్మక అడ్డంకులను పరిష్కరించడం ద్వారా మహిళలు, లింగ వైవిధ్య వ్యక్తుల హక్కులను, సంస్థలను ముందుకు తీసుకువెళ్లడం" ఇతివత్తంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నవంబరు 25 నుంచి డిసెంబరు 23వరకు మాసొత్సవాలు కొనసాగుతా యని ఆయన వివరించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. లింగ వివక్ష అనే ఆలోచన ఉండరా దని ఆడ, మగ అంతా సమానమనే భావన తీసుకురావలసిన అవసరం ఉందని అన్నారు. జిల్లాలో ఎక్కడా ఇటువంటి హింస లేకుండా అందరూ ప్రతిజ్ఞ చేయాలని, ఆదర్శవంతంగా ఉండాలని స్పష్టం చేశారు. కుటుంబం నుంచి మార్పు రావలసిన ఆవశ్యకతను తెలియజేయాలని ఆయన అన్నారు.

నేడు అవగాహన ర్యాలీ


లింగ వివక్ష వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మొదటి రోజు పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆనంద్ సూచించారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆర్.సి.ఎం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనే విధంగా చర్యలు చేపట్టారు. ఈ మేరకు ర్యాలీలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆర్‌డిఎ కె.హేమలత, డిఆర్‌డిఎ, డ్వామా, ఐసిడిఎస్ పీడీలు పి.కిరణ్ కుమార్, కె.రామచంద్ర రావు, జి.వరహాలు, ప్రాజెక్టు అధికారి కె. విజయ గౌరీ, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పి.సూర్యనారాయణ, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, ఐటిడిఎ ఎపిడి వై.సత్యం నాయుడు, జిసిడిఓ రోజా తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

బ్యాంకును ఎత్తివేయడం అన్యాయం

కలెక్టరేట్ : కురుపాం మండలం నీలకంఠాపురంలో బ్యాంకును ఏర్పాటు చేయాలని గిరిజనులకు బ్యాంకు సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా రెడ్డి వేణు డిమాండ్ చేశారు. బ్యాంకును ఏర్పాటు చేయాలని కోరుతు ఈనెల 30న నీలకంఠాపురం సచివాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు స్థానికసుందరయ్య భవనంలో ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్థానిక ప్రజాప్రతినిధులు గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని నీలకంఠాపురంలో బ్యాంకు ఎత్తివేసేనా పట్టించుకోవడంలేదని నిరసనను అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కోలక అవినాష్, కొల్లి గంగునాయుడు, వై.మన్మథరావు, వి.ఇందిర, గిరిజన సంఘం నాయకులు పండు ఉన్నారు.



పరీక్షిత్ రాజును సన్మానిస్తున్న వైసిపి నియోజకవర్గ నాయకులు

పరీక్షిత్ రాజుకు ఘనసన్మానం

జియ్యమ్మవలస : పార్వతీపురం మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులుగా నియమితులైన శత్రుచర్ల పరీక్షిత్ రాజుకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. గురువారం చినమేరంగిలోని తన నివాస గృహంలో నియోజకవర్గ పరిధిలోని ఎంపిపిలు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై పరీక్షిత్ రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి నిరంతరము కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపిలు ఉరిటి రామారావు, శెట్టి పద్మావతి, దీనమయ్య, జడ్పిటిసి ఎం.శేఖర, చిన్న మేరంగి సర్పంచ్ అల్లు రవణమ్మ, వైసిపి నాయకులు శెట్టి నాగేశ్వరరావు, ఎం గౌరీశంకరరావు, పలువురు ఎంపిటిసిలు,సర్పంచులు ఉన్నారు.

జూన్‌కి పూర్ణపాడు- లాబేసు వంతెన పూర్తి

కలెక్టర్‌కు సిపిఎం అభినందనలు

కొమరాడ : నాగావళి నదిపై నిర్మించిన పూర్ణపాడు–లాబేసు వంతెన పనులను 2023 జూన్ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ పంచాయతీరాజ్ అధికారి కృష్ణాజిని ఆదేశించడం పట్ల సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అసంపూర్తిగా వదిలేసిన పూర్ణపాడు –లాబేసు వంతెన పనులను కలెక్టర్ బుధవారం పరిశీలించారని, ఈ మేరకు సిపిఎం నాయకులు ఆయన్ను కలిసి వంతెన పనులు వేగవంతం చేసేట్టే నది అవతల గల గిరిజనులకు భరోసా కల్పించాలని కోరుతూ వినతి అందజేశామన్నారు. దీనికి కలెక్టర్ స్పందించి జూన్ 2023 కల్లా వంతెన పనులు పూర్తయ్యేలా వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఇని ఆదేశించారన్నారు. విలేకరుల సమావేశంలో దేవకోన సర్పంచి గోపి, పూర్ణపాడు గ్రామస్తులు పి.వరలక్ష్మమ్మ, తెలుగు రైతు అధ్యక్షులు బత్తిలి శ్రీనివాసరావు మహిళలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి తాగునీరు

వీరఘట్టం: గ్రామాల్లో ప్రతి ఇంటికి తాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. గురువారం ఎమ్మెల్యే స్వగ్రామైన వండవలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీరు అందించేందుకు పనులు ప్రారంభించారు. గ్రామంలో 240 పాయింట్లతో ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మిడితాన కళ్యాణి, ఇంచార్జి ఎంపిడిఓ రమణ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కె.పాపారావు, ఎం.గోవిందరావు, కండుల వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి : సిఐ

సాలూరు : మున్సిపాలిటీ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు చెప్పారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇంతవరకు ఇన్‌ఛార్జి సిఐగా పని చేసిన శ్రీనివాసరావు గురువారం నుంచి రెగ్యులర్ సిఐగా బాధ్యతలు స్వీకరించారు.

ప్రతిఒక్కరికీ పని కల్పించాలి : ఎమ్మెల్యే

వీరఘట్టం : గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అధికారులను ఆదేశించారు. గురువారం ఎమ్మెల్యే స్వగ్రామైన వండువలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో పనులు కావాల్సిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, అలాగే జాబ్ కార్డు లేని వారికి తక్షణమే జాబ్ కార్డులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని స్వదినియోగం చేసుకోవాలని గ్రామస్తులను కోరారు.వలసల నివారించేందుకు ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. సమావేశంలో సర్పంచ్ మిడితాన కళ్యాణ, ఉపాధి ఎపిడి జి.శ్రీహరిరావు, ఇన్చార్జి ఎంపీడీవో రమణ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కె.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సర్వ మంగళ పీఠాన్ని సందర్శించిన ఎమ్‌పి, ఎమ్మెల్యే

పార్వతీపురం టౌన్ : స్థానిక శ్రీ విద్యా సర్వమంగళ దేవి పీఠాన్ని గురువారం విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖరరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు సందర్శించారు. పీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ మురపాక కాళిదాసు యాజిని మర్యాదపూర్వకంగా కలుసుకొని, పీఠంలో గల సర్వమంగళ దేవి, అయ్యప్పస్వామిని దర్శించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ధాన్యం కొనుగోలులో నాణ్యత పాటించాలి

గుమ్మలక్ష్మీపురం : రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో తగిన మేరకు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఎఒ సిహెచ్ ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో విఎఎలకు, రెవెన్యూ సిబ్బంది శిక్షణలో మాట్లాడారు. రైతులు దగ్గర ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు గ్రేడింగ్ చేసి కొనుగోలు చేయాలన్నారు. బాగా ఎండిన ధాన్యాన్ని మాత్రమే రైతుల నుంచి కొనుగోలు చేయాలన్నారు. తగిన నాణ్యత ప్రమాణాలను పాటించకపోతే ప్రభుత్వం రైతులకు తగిన మేరకు డబ్బులు చెల్లించదన్నారు. శిక్షణలో సిఎస్‌డిటి ఆరిక సాంబమూర్తి, జిసిసి గోదాం సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు, డిఇఒ కె.సంతోష్ కుమార్, టిఎ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే

సీతంపేట : వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని ఎస్సై ఎ.నీలకంఠరావు అన్నారు. గురువారం స్థానిక ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఆటోలకు, వాహనాలకు తప్పనిసరిగా సి బుక్, ఇన్సూరెన్స్, లైసెన్స్, పొల్యూషన్ ధ్రువపత్రాలు ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కడించకూడదన్నారు. మితిమీరి వేగం వద్దని, ఓవర్ లోడ్ వేయరాదని సూచించారు. వాహనాలకు సంబంధించి అన్ని పత్రాలు సక్రమంగా ఉండాలన్నారు. సమావేశంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

పెదభోగిలిలో ఎంపిడిఒ పర్యటన

సీతానగరం : మండలంలోని పెదభోగిలి మేజర్ పంచాయతీలో పారిశుధ్య పరిస్థితిని తెలుసుకొనేందుకు ఎంపిడిఒ బి.కృష్ణ మహేశ్‌రెడ్డి గురువారం పర్యటించారు. గూడెం వీధి, లెక్కల వీధి మెయిన్ రోడ్డులను పరిశీలించారు. ఆయా ప్రాంత ప్రజలతో మాట్లాడారు. కాలువల్లో పూడికలు తొలగించాలని, మురుగునీరు తొలగింపు, చెత్త సేకరణ వంటి అంశాలను ఇంటి యజమానుల నుంచి అడిగి తెలుసుకున్నారు. పలు వీధుల్లోని సమస్యలు తెలుసుకుని వాటికి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఎంపిడిఒ వెంట స్పంచి తెరేజ్మ్మ, గరికయ్య, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, మండల పరిషత్ ఎఒ ఎంఎస్‌వి ప్రసాద్, ఇఒ జివి రమణ ఉన్నారు.



వీధి కాలువలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ మహేష్‌రెడ్డి

ప్రతిభను ప్రోత్సహించేందుకే యువజనోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్యార్థుల్లో దిగా ఉన్న ఉన్న ప్రతిభను ప్రోత్సహించడమే యువజనోత్సవాల ఉద్దేశమని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శించి ప్రతిభకు మరింత పదునుపెట్టే అవకాశం ఉంటుందని చెప్పారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఎమ్మెల్యే గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి, స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి వేడుకల సందర్భంగా జిల్లా స్థాయి యువజనోత్సవాలను మొట్టమొదటగా జిల్లాలో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. వివేకానందుని స్ఫూర్తి, ఆలోచనా విధానం ప్రతి విద్యార్థికి ఉంటే, మరో వివేకానందుడు అవుతారని తెలిపారు. సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడం యువత వల్లే సాధ్యమన్నారు. ప్రతి విద్యార్థి తన గమ్యాన్ని నిర్దేశించుకొని చదవాలని సూచించారు. లక్ష్యాన్ని చేరుకోవడానికి ఓర్పు, సహనం, గమ్యాన్ని చేరుకోవాలనే కసి, పట్టుదల ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో కృషి చేసి జాతీయ స్థాయిలో జిల్లాకు మంచి పేరు తీసురావాలని ఆకాంక్షించారు. సాంస్కృతిక పోటీల్లో భాగంగా జానపద నృత్యాలు, గీతాలు, సాంప్రదాయ గాత్రం, వాయిద్య పోటీలు నిర్వహించారు. విజయనగరం మహారాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులను న్యాయ నిర్ణేతలుగా నిర్ణయించామని తెలిపారు. పోటీలో గెలుపొందిన మొదటి, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు, సర్టిఫికేట్లను అందజేస్తామన్నారు. పోటీలలో ప్రథమ స్థానంలో గెలుపొందిన విజేతలను డిసెంబర్ 13 నుండి 15 వరకూ గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలకు పంపిస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో విజేతలు 2023 జనవరి 12 నుంచి 16 వరకూ జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. వివిధ కాలేజీలకు చెందిన విద్యార్థులు తమ ప్రదర్శనలతో ఆహూతులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సెట్విజ్ సిఇఒ బి.రామానందం, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చలపతిరావు, సెట్విజ్ మేనేజర్ మూర్తి, వివిధ కళాశాలల అధ్యాపకులు, ఐఆర్‌పిడబ్ల్యూ సంస్థ అధ్యక్షులు ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినిలను అభినందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు


గుజ్జువాయిలో గడపగడపకు...

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుజ్జువాయిలో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి నిర్వహించారు. గుజ్జువాయి సర్పంచ్ హెచ్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదని ఆరా తీసి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఎంత మేరకు ఉపయోగపడుతున్నాయో లబ్ధిదారులతో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పిటిసి గొర్ల సుజాత, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, వైస్ఎంపిపిలు రంగారావు, అన్నాజీరావు, మాజీ ఎంపిపి ఇందిరా కుమారి, మొండిఖల్ ఎంపిటిసి జి.విద్యారాణి, జి.శివడ సర్పంచ్ బి.మిన్నారావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని ఆర్.వెంకంపేట సచివాలయం పరిధిలోగల రెడ్డి వానివలస, రామవరం గ్రామాల్లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డివానివలసలో తాగునీటి సమస్యపై ఎమ్మెల్యేకు ప్రజలు విన్నవించగా, స్పందించిన ఎమ్మెల్యే సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రమణమ్మ, జెడ్‌పిటిసి ఎం.బాబ్జీ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని సింగిడి గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని అరుకు ఎంపి జి.మాధవు, ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదానని ప్రశ్నించారు. సింగిడి ప్రాథమిక పాఠశాలలో భవనం, టాయిలెట్స్ ఏర్పాటు చేయాని విద్యార్థులు ఎమ్మెల్యేను కోరగా, నాడు –నేడు ద్వారా త్వరగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కేన్సర్‌తో తన కుమారుడు చనిపోయాడని, ఇల్లు, స్థలం ఏర్పాటు చేయాలనీ జి.షర్మిల కోరారు. విద్యా దీవెన మూడో విడత విడుదల కాలేదని బి.ఫార్మసీ విద్యార్థిని సాయి ప్రీతి తెలిపారు. కార్యక్రమంలో జెడ్ పి టి సి బొడ్డేపల్లి. ప్రసాదరావు, వైస్ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం, సర్పంచ్ మడపాన కేశ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భామిని : సింగిడిలో కరపత్రాలు అందజేస్తున్న ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

కూనేరు రైల్వేస్టేషన్లో గుంటూరు ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని కూనేరు రైల్వే స్టేషన్లో గుంటూరు రాయగడ ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 10లోగా హాల్ట్ ఇచ్చేందుకు రైల్వే అధికారులు చర్యలు తీసుకున్నట్టు రైల్వే శాఖ అధికారులైన కమర్షియల్ ఇన్స్ట్రక్టర్ వినేష, రాయగడ ఆర్పిఎఫ్ ఎస్ఐ ఎకె తాజి, ఆర్‌పిఎఫ్ ఎస్ఐ బిబి రాము కోనేరు రైల్వే స్టేషన్ మాస్టర్ సాహూ వెల్లడించారు. ఈ మేరకు గురువారం స్థానిక విలేకరులతో కూనేరు రైల్వే స్టేషన్‌లో రైల్వే అధికారుల సమక్షంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులకు సాంబమూర్తి, టిడిపి నాయకులు మరడాన కృష్ణమూర్తినాయుడు, బత్తిలి శ్రీనివాసరావు, రాయగడ జిల్లా కెరడా మాజీ సర్పంచ్ సెలపురెడ్డి రాంబాబు మాట్లాడారు. కరోనా సమయంలో కూనేరు రైల్వేస్టేషన్లో గుంటూరు– రాయగడ ఎక్స్‌ప్రెస్ రైలును నిలిపివేయడం రద్దు చేశారని, మళ్లీ కరోనా వైరస్ వ్యాప్తి తగ్గుముఖం పట్టిన సందర్భంలో ఈ రైలు అన్ని స్టేషన్లో నిలుపుదల చేస్తూ, ఒక్క కూనేరులో నిలుపుదల చేయలేదని అన్నారు. దీంతో ఇక్కడ రైల్వే హాల్ట్ ఇవ్వాలని కోరుతూ పలుమార్లు వివిధ రూపాల్లో ఆందోళనలు చేసినా అధికారుల్లో స్పందన లేదన్నారు. ఆఖరుకు విశాఖపట్నం డిఆర్‌ఎంను కలిసినా పట్టించుకోలేదన్నారు. ఆఖరుకు ఈనెల 26న కూనేరు రైల్వేస్టేషన్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని ప్రకటించగా, విషయం తెలుసుకున్న డిఆర్‌ఎం సిపిఎం, టిడిపి నాయకులతోనూ, రాయగడ రైల్వే సిబ్బందితో బుధవారం చర్చించారన్నారు. ఈ చర్చల్లో జనవరి 10లోగా కూనేరు రైల్వే స్టేషన్లోలో హాల్ట్ ఇస్తామని అధికారులు అంగీకరించారన్నారు. దీంతో ఈనెల 26న తలపెట్టి మహాధర్నాను వాయిదా వేసినట్టు తెలిపారు. జనవరి 10లోగా హాల్ట్ ఇవ్వకపోతే రైల్‌రోకో చేస్తామని స్పష్టం చేశారు.

ప్రజలకు రక్షణ ఏదీ?

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లాలోని పలు మండలాల ప్రజలు ఒక వైపు ఏనుగుల నుంచి తమ పంటలను, ప్రాణాలను కోల్పోతుండగా, ఇప్పుడు కొత్తగా పులి ప్రవేశించడంతో దీనివల్ల వరుసగా పశువులను కోల్పోతున్నారని, దీనివల్ల ఎప్పటిలోగా సమస్యను పరిష్కరిస్తారో అటవీశాఖ అధికారులు సమాధానం చెప్పాలని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొబ్బిలి చిరంజీవులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో వారు మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఈ ప్రాంతాల్లో ఏనుగు తిష్టవేయడం వల్ల కురుపాం, పార్వతీపురం, పాలకొండ జిల్లాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడమే కాకుండా ఇప్పటికే 10మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని, రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంటలను ఒకవైపు కోల్పోతుండగా, అధికారులు మీన మేషాలు లెక్కపెడుతున్నారని అన్నారు. విజయనగరం జిల్లాలో పులి జాడ కనిపించినప్పుడే, మన జిల్లాలో ప్రవేశించడకుండా ముందుస్తు చర్యలు తీసుకోలేదని విమర్శిం చారు. జంతికొండ ప్రాంతమంతా దట్టమైన అడవులతో నిండిన ప్రాంతమని, ఒక వేళ ఆప్రాంతాన్ని ఆవాసంగా మార్చుకుంటే పరిసర గ్రామ ప్రజలకు చాలా ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. వెంటనే అధునిక పద్ధతులు ప్రయోగించి అటు ఏనుగుల ఎ , పులి సమస్యలను పరిష్కరించి, ప్రజలకు జరుగుతున్న అస్తి ప్రాణ నష్టాలను తొలగించాలని డిమాండ్ చేసారు. సమావేశంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు దొగ్గమోహనరావు, కౌన్సిలర్ బి.గౌరినాయుడు, నాయకులు పాల్గొన్నారు.

చినమేరంగిలో సర్కిల్ కార్యాలయం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని చిన్నమేరంగిలో పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సిహెచ్ ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అదనంగా పోలీస్ సర్కిల్ కార్యాలయాలు ప్రారంభించాలని ఆ శాఖ అధికారులు గతంలోనే ప్రకటన చేశారు. కేసులు పరిష్కారం కొరకు పరిధిని తగ్గించి అదనపు సర్కిళ్లను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా చిన్నమేరంగి సర్కిల్ పరిధిలోకి చినమేరంగి, జియమ్మవలస, గరుగుబిల్లి పోలీస్ స్టేషన్లు వస్తాయి. ఈ సందర్భంగా సిఐ ప్రసాద్ మాట్లాడుతూ మూడు పోలీస్ స్టేషన్ పరిధిలో గల సమస్యలను గురించి చర్చించామన్నారు. ప్రధానంగా చిన్న మేరంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో నాటు సారా వ్యాపారం ఎక్కువగా కొనసాగుతుందని, గరుగుబిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో భూ సమస్యలతోపాటు, రహదారి ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని, వీటిపై దృష్టి పెట్టామని తెలిపారు. నాటు సారా అమ్మకాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఇటువంటి చర్యలు చేపట్టాలనే దానిపై సన్నాహాలు చేస్తామని అన్నారు. కౌన్సిలింగ్ ద్వారా నాటు సారా తయారీ, విక్రయదారులను మార్చే ప్రయత్నాలు చేపడతామని అన్నారు. గరుగుబిల్లి మండలంలో రహదారి ప్రమాదాలపై అవగాహన లు కల్పిస్తామని ప్రమాదాల నివారణ చర్యలు పట్టిష్టంగా చేపడతామని తెలిపారు. భూ సమస్యలపై అధికారులు, స్థానిక నాయకులతో కలిసి చర్చించి సమస్యలు పరిష్కారానికి కషి చేస్తూ రైతాంగానికి ఎటువంటి సమస్యలు లేకుండా చూస్తామని సిఐ పేర్కొన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, ఎటువంటి సమస్య లైనా తమ కార్యాలయానికి నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చునని సి ఐ తెలిపారు.

డంపింగ్ యార్డ్ పెడితే ఊరుకోం

ప్రజాశక్తి - కురుపాం

పార్వతీపురం మున్సిపాలిటీకి చెందిన చెత్తను డంపింగ్ చేసేందుకు గరుగుబిల్లి మండలం కొంకడివరం రెవెన్యూ పరిధిలో సీతారాంపురం గ్రామ సమీపాన డంపింగ్ యార్డ్‌ను పెట్టే ఆలోచనను తక్షణమే అధికారులు ఉపసంహరించుకోవాలని సిపిఎం నాయకులు బివి రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ప్రదేశాన్ని సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రతిపాదించిన ఈ ప్రాంతం అడ్డాపుశీల కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయానికి ఆనుకొని ఉందని, ఇది ప్రజలు మనోభావాలను దెబ్బతీసే నిర్ణయమని అన్నారు. అలాగే కొంకడివరం, సీతారాంపురం గ్రామాల ప్రజలు పశువులు, గొర్రెలు మేపుకునేందుకు నిత్యం తిరుగాడే ఈ ప్రదేశం లో డంపింగ్ యార్డ్ ఎలా పెడతారని ప్రశ్నించారు. అలాగే భూగర్భ నీటి వనరులు కలుషితంగా మారుతాయని, తాగునీటికి కూడా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు తీసుకునే ఈ అనాలోచితి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కొంకడివరం సర్పంచ్ అల్లు అప్పలనాయుడు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ పెట్టేందుకు ఎట్టి పరిస్థితుల్లో పంచాయతీ నుంచి అనుమతులు ఇచ్చే ప్రసక్తే లేదని, అధికారులు తక్షణమే డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పరిశీలనలో కొంకడివరం, సీతారాంపురం గ్రామాల నాయకులు జనార్ధన, మురళి, శివున్నాయుడు,రాజు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ

భామిని : వరి కోతలు అనంతరం రైతులు తమ పొలాల్లో వేయడానికి అవసరమైన సబ్సిడీపై మినుము, పెసర విత్తనాలను పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి మండలంలోని సింగిడిలో రైతులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్‌బికెల ద్వారా పూర్తి స్థాయిలో ప్రభుత్వ మద్దతు ధరతో ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండలంలోని 16 ఆర్‌బికెల ద్వారా రబీ సీజన్లో రైతులు అందించడానికి పెసర 14 క్వింటాలు, మినుములు 22క్వింటాలు, 2 క్వింటాల కట్టిజనుము విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అలాగే మరికొన్ని రోజుల్లో 35 క్వింటాలు వేరుశెనగ, నువ్వులు 2.4 క్వింటాలు రానున్నాయని వ్యవసాయ అధికారి కె. సింహాచలం తెలిపారు. అన్ని ఆర్‌బికె పరిధిలో రైతులకు ఈ క్రాప్ నమోదు ధ్రువీకరణ పత్రాలు అందజేశామని ఎఒ తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాదరావు, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, వైసిపి కన్వీనర్ తోట సింహాచలం, సర్పంచ్ మడపానా కేశవ, నాయకులు పాల్గొన్నారు.

వీరఘట్టంలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండల కేంద్రంలోని సాయి నగర్ కాలనీలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి గర్భిణీల, బాలింతలు, రక్తపోటు మధుమేహ, తదితర రకాలైన వ్యాధిగ్రస్తులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతికుమారి, ఎఎన్ఎం ఉష, టెక్నీషియన్ దినేష్, ఎంఎల్‌హెచ్ పి.భాగ్యరాధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



జగనన్న ఇళ్ల నిర్మాణాలపై సచివాలయ సిబ్బందిని సమీక్షిస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్

గృహ నిర్మాణాలపై సబ్ కలెక్టర్ సమీక్ష

గుమ్మలక్ష్మీపురం : మండలానికి కొత్తగా మంజూరైన జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మండలానికి 800 వరకు జగనన్న ఇళ్లు మంజూరైనా నేటి వరకూ పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగకపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. గుమ్మలక్ష్మీపురం, జియమ్మ వలస మండలాల్లో ఇంటి నిర్మాణాలు ప్రారంభం కాకపోవడంతో జిల్లా కలెక్టర్ ఆగ్రహంతో ఉన్నట్లు తెలిపారు. ప్రత్యేక దృష్టి సారించి రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. ఇప్పటికీ ప్రారంభించని ఇళ్లను ప్రారంభించి పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జి.జగదీష్ కుమార్, హౌసింగ్ ఎఇ రెడ్డి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి ప్రవర్తన కలిగి ఉండాలి

సీతానగరం : విద్యార్థులు మంచి ప్రవర్తన కలిగి ఉండాలని డిఎస్పి ఎ.సుభాష్ అన్నారు మండలంలోని జోగింపేట ప్రతిభ గురుకుల కళాశాలలో గురువారం విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్ పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మంచి సంబంధాలు ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి తన చదువుతో పాటు సమాజంపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థి దశలోనే సత్ప్రవర్తన ఉంటే విద్యార్థి అభివృద్ధి చెందుతాడన్నారు. కార్యక్రమంలో ఎస్సై కె.నీలకంఠం, కళాశాల ప్రిన్సిపల్ అప్పలనాయుడు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

రైతు భరోసా అర్హులకు ప్రత్యేక గ్రీవెన్స్

పాచిపెంట : రైతు భరోసా పొందని అర్హత గల రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు అధికారులు గురువారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు మధుసూదనరావు మాట్లాడుతూ అర్హత ఉన్న రైతులు ఈనెలాఖరులో రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమవుతాయని, దీనికోసం ప్రత్యేక వ్యధ విభాగాన్ని నిర్వహించామని తెలిపారు. మరణించిన రైతు నామినీగా భర్త లేదా భార్యకు మాత్రమే అవకాశం ఉందన్నారు. కావున అర్హులైన రైతులంతా తమ వివరాలను ఆర్‌బికెల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. అంతేకాక ఈనెల 29న సున్నా వడ్డీ పంట రుణాల నిధులు ఆ రైతుల ఖాతాల్లో జమకానున్నాయని, ఈ జాబితాలను ఆర్‌బికెల్లో ప్రదర్శించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు పాల్గొన్నారు.

సందివలసలో తాగునీటి సమస్యకు పరిష్కారం

పార్వతీపురంరూరల్ : మండలంలోని వెలగవలస పంచాయితీ, సందివలస గిరిజన గ్రామానికి తాగునీటి బోరు రిపేరు కావడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు బుధవారం ఎంపిడిఒ అకిబ్ జావేద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన స్పందించిన గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ బసవరాజును అప్రమత్తం చేయడంతో గ్రామంలో బోరును బాగు చేయించారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

పార్వతీపురంరూరల్ : మండలంలోని పెదమరికి పంచాయతీ నిధులు దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు గురువారం స్థానిక ఎంపిడిఒ అకిబ్ జావేద్ విచారణ ప్రారంభించారు. కార్యదర్శి చంద్రశేఖర్‌ను, సర్పంచ్‌ను పిలిపించి నిధుల వినియోగంపై వివరణ అడిగారు. పాలకవర్గం ఏర్పడిన తర్వాత కేవలం రెండుసార్లే సాధారణ సమావేశాలు నిర్వహించడం పట్ల సంజాయిషీ కోరారు. అనంతరం ఏ నిధులు ఎప్పుడు ఎలా డ్రా చేశారో నివేదిక ఇవ్వాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లడుతూ ప్రాథమిక విచారణ జరిపామని, త్వరలోనే పూర్తిస్థాయి విచారణ ప్రారంభమవుతోందన్నారు. నిధులు దుర్వినియోగం నిజమని తేలితే ఇరువురిపైనా చర్యలు ఉంటాయని తెలిపారు. విచారణలో ఇఒపిఆర్‌డి కృష్ణుడు, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నాడు నేడు పనులు పరిశీలన

బలిజిపేట : మండలంలోని నాడు నేడు నిధులు చేపడుతున్న పనులను జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి డి.మంజుల వీణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు నేడు కార్యక్రమంలో భాగంలో నిర్వహించిన మరుగు దొడ్ల నిర్మాణం, పాత మరుగుదొడ్ల మరమ్మ తులు, గ్రానైట్ ఫిక్సింగ్ పనులు, టేబుల్ పెయింటింగ్స్, ఎలక్ట్రికల్ పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే అధ్యాపక సిబ్బందికి కళాశాల అభివృద్ధి విషయమై తగు సూచనలు అందించారు. అకడమిక్ విషయా లపై మాట్లాడుతూ అధ్యాపకులంతా సమిష్టి కృషితో పనిచేసి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం.జ్యోతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ బడ్జెట్‌కు ఆమోదం

పార్వతీపురంరూరల్ : మండల పరిషత్ బడ్జెట్ సమావేశం గురువారం ఎంపిపి మజ్జి శోభారాణి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. తొలుత 2022–23గాను సవరణ బడ్జెట్, 2023–24 అంచనా బడ్జెట్‌ను రూ.76,09,08,000తో ఎంపిడిఒ అకిబ్ జావేద్ ప్రవేశపెట్టగా, సూపరింటెండెంట్ ఎల్‌వి అప్పారావు సభ్యులకు చదివి వినిపిం చారు. అనంతరం సభ్యుల సందేహాలకు ఎంపిడిఒ సమాధానం ఇచ్చారు. అనంతరం సభ్యులు ఏకగ్రీవంగా బడ్జెట్‌ను ఆమోదించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బలగ రేవతి, వైస్ ఎంపిపి సిద్ధా జగన్నాధరావు, తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

విద్యతోపాటు క్రీడలు అవసరమే : ఎమ్మెల్యే

కురుపాం : విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా అవసరమేనని, ఇందులోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నైపుణ్యం ప్రదర్శించాలని స్థానిక ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి అన్నారు. గురువారం సిఎం కప్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు శారీరక ధృఢత్వం, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థి స్థాయి నుంచే విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయికి వెళ్లి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రామగోవిందం, వివిధ పాఠశాలల పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఎల్విన్ పేట పోలీసుస్టేషన్‌లో 2020లో నమోదైన దొంగతనం కేసులో ఇరువురు ముద్దాయిలకు రెండేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.4వేలు జరిమానా కోర్టు విధించినట్లు ఎల్విన్‌పేట ఎస్ఐ వి.షణ్ముఖరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చెరుకుబిల్లి కిషోర్, నవీన్‌కు సంబంధిత కేసులో నేరం రుజువైనందున కురుపాం జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఈ. ఆంజనేయులు ముద్దాయిలిద్దరికీ ఈ శిక్ష విధించారని తెలిపారు. జరిమానా కట్టనిచో ముద్దాయిలు ఒక్కొక్కరికి 6 నెలలు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. ఈ మేరకు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిమిడి చంద్రకుమార్ ప్రాసెక్యూషన్ తరపున వాదించారని ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా ఇసుక రవాణా కేసులో ఇరువురికి ఏడాది జైలు శిక్ష

: అక్రమంగా ఇసుక రవాణా కేసులో కేసు నమోదు అయిన ఇరువురు ముద్దాయిలకు కురుపాం ఫస్ట్ క్లాస్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఈ. ఆంజనేయులు ఏడాది జైలు శిక్ష తో పాటు, రూ.5వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐతెలిపారు. మండలంలోని రేగిడికి చెందిన తోయక వాసు, నిమ్మక రాంపండుపై నేరం రుజువైనందున వీరికి ఏడాది జైలు, రూ.5వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. జరిమానా కట్టనిచో ఒక్కొక్కరికి 6 నెలలు జైలు శిక్ష ను న్యాయమూర్తి విధించారని అన్నారు.

సచివాలయ ఉద్యోగుల ఏజెన్సీ అలవెన్స్ పునరుద్ధరించాలి

సీతంపేట : ఏజెన్సీలో గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఏజెన్సీ అలవెన్స్ పునరుద్ధంచాలని ఎపి ఉద్యోగుల సంఘం పార్వతీపురం మన్యం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నూతలపాటి భరత్ భూషణ్‌రాజ్ ప్రభుత్వాన్ని కోరారు.గురువారం పురాయిపువలస సచివాలయ ఆవరణలో సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో గ్రామ సచివాలయ ఉద్యోగులకు అందజేసిన స్పెషల్ కాంపొనెంట్ అలవెన్స్, ఏజెన్సీ అలవన్స్ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. మిగతా ఉద్యోగులకు ఇచ్చి, తమకు నిలిపివేయడం తగదన్నారు. అంతేకాక గతంలో ఇచ్చిన అలవెన్సులు రికవరీ చేయమని ఉత్తర్వులు జారీ చేయడం పట్ల గ్రామ సచివాలయ ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమావేశంలో సీతంపేట మండల సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రంగారావు, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు